క్లుప్తంగా

పండ్ల తోటల సాగుతో లాభాలు



నిమ్మ తోటను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకుంటే రైతులు అధిక లాభాలు పొందవచ్చని కోడుమూరు ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శుక్రవారం కోడుమూరులో ఉపాధి హామీ పథకం కింద సాగవుతున్న జామ, నిమ్మ తోటలను ఆయన పరిశీలించారు. ఉపాధి పథకం కింద పండ్లు, పూల తోటలు సాగు చేసుకునేందుకు చిన్న,సన్న కారు రైతులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని తెలిపారు. వాటి సంరక్షణ కోసం నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: గూడూరు 33 కేవీ, లద్దగిరి 33 కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు గూడూరు సబ్ డివిజన్ డీఈఈ జేసస్ తెలిపారు. ఉదయ 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా గూడూరు, కే.నాగులాపురం, కోడుమూరు, లద్దగిరి, సి.బెలగల్, కొత్తకోట 33–11 కేవీ సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

సి.బెళగల్: సి.బెళగల్ మోడల్ స్కూల్‌లో శనివారం ఉదయం 9:30 గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ వంశీ మోహన్ తెలిపారు. మాండలేజ్ ఇండియా (క్యాడ్బరీ) చాక్‌లేట్ కంపెనీ ప్రతినిధులు మండలానికి చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఒకే ప్రయత్నంలో ఇంటర్మీడియెట్ 50 శాతం మార్కులతో పాస్ అయిన వారు,ప్రస్తుతం రెండో ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వయస్సు 20 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8897357484 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నీటి పొదుపు అందరి బాధ్యత



బోరుబావిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, తాగునీటి వనరులను సంరక్షించుకోవాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. శుక్రవారం సి.బెళగల్‌లోని కొత్త కాలనీలో బోరుబావిని ఆమె పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి వనరులను ఎవరైనా నష్టం కలగజేస్తే కఠిన చర్యలుంటాయని తెలిపారు. ఆమె వెంట ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, వీఆర్వో శేఖర్ ఉన్నారు.

శరవేగంగా పాఠశాల గదుల నిర్మాణం

సి.బెళగల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మనబడి నాడు–నేడు రెండో విడతలో భాగంగా మొత్తం ఏడు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.80 లక్షలను విడుదల చేసింది. దీంతో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే నాలుగు గదులు పూర్తయ్యాయి. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతిపై సంతాపం

పాణ్యం: పాణ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ ఉసేన్‌సాహెబ్ (77) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఉసేన్‌బాషా, జాకీర్‌ఉసేన్, బాబు, చాంద్‌బాషా, బాషా, ఖలీల్, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు ఉన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

కల్లూరు: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని ఎంఈఓ–1 శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల విద్యాధికారి కార్యాలయంలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

చూపును తినేస్తోంది!

- ఏటా పెరుగుతున్న గ్లకోమా బాధితులు
- ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ఏటా 2వేల మందికి చికిత్స
- 40 ఏళ్లు పైబడిన వారిలో వ్యాధి లక్షణాలు
- జీపీ, షుగర్, స్టెరాయిడ్ మందుల వాడకంతో సమస్య
- గ్లకోమా అవగాహన వారోత్సవాల సందర్భంగా..

అంత వరకు అందంగా కనిపించిన ప్రపంచం ఒక్కసారిగా అంధకారంగా మారిపోతే.. రాత్రివేళల్లో కరెంటు పోయినట్లుగా అంతా చీకటిగా అగుపిస్తే ఎంత నరకమో కదూ. గ్లకోమా సైతం ఉన్న ఫలంగా ఇలాగే దృష్టిని తినేస్తుంది. చాపకింద నీరులా విస్తరించే ఈ వ్యాధిని ముందుగా గుర్తించి చికిత్స తీసుకుంటే చూపు మిగులుతుంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, నంద్యాల కంటి ఆసుపత్రితో పాటు 11 విజన్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో చికిత్స కోసం వచ్చే వారిలో గతంలో 3 శాతం వరకు గ్లకోమా బాధితులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 5 నుంచి 10 శాతం వరకు ఉంటోంది. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ 250 నుంచి 300 మంది దాకా చికిత్స కోసం వస్తుంటారు. వీరిలో రోజుకు కనీసం 10 నుంచి 20 మంది గ్లకోమా బాధితులు ఉంటున్నారు. ఈ ఆసుపత్రిలో గత ఐదేళ్లలో పదివేల మందికి గ్లకోమా చికిత్స చేశారు. వీరితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో మరో వెయ్యి మందికి పైగా చికిత్స తీసుకున్నట్లు అంచనా. ఈ మేరకు గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రాంతీయ కంటి వైద్యశాలలో ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. చికిత్స కోసం వచ్చిన వారికి గ్లకోమాపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. గ్లకోమాకు నీటికాసులు, నల్లముత్యం, కాలామోతి అని కూడా అంటారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

35 నుంచి 40 ఏళ్ల వయస్సులో గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా కళ్లకు దెబ్బలు తగిలిన వారు, హ్రస్వదృష్టి కలిగిన వారు, స్టెరాయిడ్స్ మందులు వాడే వారు, మధుమేహం, బీపీ ఉన్న వారు, కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉంటే దగ్గరి బంధువులు అప్రమత్తంగా ఉండటం అవసరం.



కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ప్రాథమిక దశలో గ్లకోమా లక్షణాలు

- 40 ఏళ్లు పైబడి వారు తరచూ అద్దాలు మార్చాల్సి రావడం.
- మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యమవడం.
- క్షేత్రదృష్టిని క్రమేణా కోల్పోవడం.
- కంటి ఎరుపు, నీళ్లు కారడం, కంటినొప్పి, దృష్టి మందగించడం, వాంతులు లాంటి లక్షణాలు కూడా కొంత మందిలో కనిపించవచ్చు.
- లైట్ల చుట్టూ రంగుల వలయాలు కనిపించడం.

గ్లకోమా నిర్ధారణ

- గ్లకోమా నిర్ధారణకు ఈ కింది సమగ్ర కంటి పరీక్షలు వివరంగా చేయడం తప్పనిసరి
- అక్షర పటం చదివే సాధారణ కంటి పరీక్ష
- స్లిట్ ల్యాంప్ (మైక్రోస్కోప్) పరీక్ష. ఈ స్లిట్ ల్యాంప్ కంటి వైద్యునికి స్టెతస్కోప్ వంటిది. కంటి పరీక్షల్లో అందరికీ ఇది తప్పనిసరి.
- అప్లనేషన్ టోనోమీటర్ అనే పరికరంతో కొలుస్తారు. అప్పుడప్పుడు వేర్వేరు సమయాల్లో ఒత్తిడిని పరీక్షించాల్సిన అవసరం రావచ్చు.
- గ్లకోమా ఏ రకమో నిర్ధారించడానికి కంటి కోణాన్ని గొనియోస్కోప్ అనే పరికరంతో పరీక్షిస్తారు.
- కంటిలో మందు చుక్కలు వేసి నేత్ర బింబాన్ని కంటి వెనుక భాగాన్ని రెటీనాను పరీక్షించడం కూడా చాలా అవసరం. నేత్రబింబాన్ని కంప్యూటర్ స్కాన్ కూడా చేయవచ్చు.
- వ్యాధి నిర్ధారణ చేయడానికి మీ డాక్టర్ ఆటోమేటెడ్ ఫీల్డ్ లేదా పెరిమెట్రి పరీక్ష నిర్వహిస్తారు.
- తొలిదశలో గ్లకోమాను కేవలం గుర్తించగలుగుతారు లేదా ఆటోమేటెడ్ పెరిమెట్రి పరీక్ష ఉపయోగించడం ద్వారా పర్యవేక్షిస్తారు.

చికిత్స మార్గాలు

గ్లకోమాకు శాశ్వత చికిత్స లేదు. చికిత్స ద్వారా మిగిలిన చూపును కాపాడవచ్చు. అందుకనే ఈ వ్యాధిని తొలి దశలో గుర్తించడం చాలా ముఖ్యం. కొందరి రోగుల్లో గ్లకోమాను కేవలం మందులతో అదుపు చేయవచ్చు. మరికొందరికి లేజర్ చికిత్స లేదా శస్త్ర చికిత్స అవసరం కావచ్చు. సాధారణ అంగిల్ క్లోజర్ గ్లకోమా చికిత్సలో డాక్టర్ లేజర్‌ను ఉపయోగించి ద్రవం ప్రవహించడానికి మరోమార్గం తయారు చేస్తారు. కానీ బాగా ముదిరిన దశలో రోగిని మందులు శస్త్రచికిత్సల అవసరం ఉంటుంది. ఈ అంగిల్ క్లోజర్ గ్లకోమా వచ్చినప్పుడు కంటి నరానికి నష్టం జరగకుండా ఒత్తిడిని సాధ్యమైనంత త్వరగా తగ్గించాలి. ఓపెన్ అంగిల్ గ్లకమోను ఒత్తిడిని తగ్గించేందుకు ముందుగా కంటిలో మందు చుక్కలు వేస్తారు. వ్యాధి ముదిరినప్పుడు సాధారణ చికిత్స పని చేయకపోతే శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. గ్లకోమాను జీవితాంతం పర్యవేక్షించాల్సి ఉంటుంది. పరీక్ష ఎంత తరచుగా చేయాలనేది వ్యాధి దశపై ఆధారపడి ఉంటుంది. మీ వ్యాధి దశను బట్టి మీకు చుక్కల మందు అవసరమా లేదా లేజర్ చికిత్స అవసరమా లేదా శస్త్రచికిత్స అవసరమా అనేది మీ డాక్టర్ సలహా ఇస్తారు. వచ్చిన ప్రతిసారి వ్యాధి ఎంత పెరిగిందో నిర్ధారించేందుకు చికిత్సలో మార్పులు చేయడానికి కొన్ని పరీక్షలు చేయాల్సి రావచ్చు.

ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదు



గ్లకోమాకు శాశ్వత చికిత్స లేదు. అయితే చికిత్స ద్వారా ఇక మిగిలిన చూపును మాత్రమే కాపాడవచ్చు. గ్లకోమాకు కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ ప్రత్యేకమైన పరీక్షలు నిర్వహిస్తున్నాము. వ్యాధినిర్ధారణ అయిన వారిలో కొందరికి కేవలం మందులతోనే అదుపు చేయవచ్చు. మరికొందరికి లేజర్ చికిత్స, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. బీపీ, షుగర్ ఉంటే నియంత్రణలో ఉంచుకోవాలి. కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా తరచూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.

–డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, కర్నూలు

అవగాహన కార్యక్రమాలు



గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహించాం. ఇందులో భాగంగా 10వ తేదీన నగరంలో ర్యాలీ నిర్వహించాము. 11, 12వ తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో వైద్యపరీక్షలతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాము. 13వ తేదీన పీజీలకు సెమినార్ ఏర్పాటు చేశాము. మిగిలిన రోజుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ప్రజలు గ్లకోమాను నిర్లక్ష్యం చేయకుండా తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ సంధ్యారెడ్డి, జిల్లా అంధత్వ నివారణాధికారి, కర్నూలు

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మెడికల్ కిట్లను అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య



వైద్య సేవలపై ఆరా తీస్తున్న వ్యాధి నిరోధక టీకాల అధికారి ప్రవీణ్‌కుమార్

- డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య
- గోరంట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం తనిఖీ

కోడుమూరు రూరల్: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం కోడుమూరు మండలం గోరంట్లలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన తనిఖీ చేశారు. శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. హెల్త్ క్యాంపులో బీపీ, షుగర్, కంటి, రక్త, ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా షుగర్ వ్యాధిని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు దేవేంద్రప్రసాద్, శృతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, హెల్త్ సూపర్‌వైజర్ శాంత, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి, అందుకు అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. వాటి వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అనంతరం మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్వేతా, శిల్పారెడ్డి, నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్
- కోడుమూరులో హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం



ఆర్బీకేను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీష్



ప్రభుత్వ మేలును ప్రజలకు వివరిస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమవుతుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. శుక్రవారం కోడుమూరులో రూ.70 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. జగనన్న అమలు చేసి సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని, ప్రజల ఆశీర్వాదంతో కోడుమూరు కోటపై మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పే మాయమాటలు నమ్మకుండా, తమకు అన్ని విధాలా మేలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం లక్ష్మీనగర్, బుడగజంగాల కాలనీల్లో పర్యటించి ప్రభుత్వ మేలును వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఏఓ రవిప్రకాష్, ఏఈ గంగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ఉపసర్పంచ్ మాదులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, రమేష్‌నాయుడు, మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సోమన్న, హనుమంతు, లింగమూర్తి పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

కల్లూరు: మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దేవదాయశాఖ రూ.1.25 కోట్లు కేటాయించినట్లు ఈఓ గురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాగలక్ష్మయ్య, కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, అరుణ, శ్వేతారెడ్డి, నాయకులు రంగప్ప, విరేంద్రకుమార్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

సమావేశాలకు అనుమతి తప్పనిసరి

పాణ్యం: నంద్యాల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సమావేశాలు నిర్వహించాలనుకుంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని నంద్యాల డీఎస్పీ ఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 30 యాక్ట్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. లేకుంటే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ యాక్ట్‌పై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

గూడూరు: పట్టణంలో 15 ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ వి.దివాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం రూ.2.80 లక్షలతో జెండా కట్ట సమీపంలో సీసీడ్రైన్ నిర్మాణానికి వైస్ చైర్మన్ పీఎన్ అస్లామ్‌తో కలిసి భూమి పూజ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మద్ది, నంద కిషోర్, ఏఈ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఏ జిలానీ, సత్యాలు, ఎస్సీ భాస్కర్, గంగారామ్, ప్రభాకర్, గౌస్ తదితరలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

కోడుమూరులో పోలీసు కవాతు

కోడుమూరు: ఎన్నికల్లో ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కోడుమూరు, పులకుర్తి గ్రామాల్లో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాల నరసింహులు, హనుమంతప్ప, తిమ్మారెడ్డిలతో పాటు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల వేళ గ్రామాల్లో అలజడి సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సీఐ కోరారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో కిస్తీలు



అన్నప్రసాదాలు తీసుకెళ్తున్న గురువులు

ఓర్వకల్లు: స్థానిక హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి దర్గాలో శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో కిస్తీలు సమర్పించారు. దర్గా పీఠాధిపతి నజురుల్లాషా ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతేహాల అనంతరం ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ స్లో పందెంలో రాంబాబు ప్రథమ బహుమతి దక్కించుకోగా, మహబూబ్ రెండో బహుమతి సాధించినట్లు నిర్వాహకులు చంద్రపాల్, ఇంతియాజ్‌బాషా తెలిపారు. కిస్తీల కార్యక్రమంతో ఉరుసు ముగిసినట్లు పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం.. నిందితుల అరెస్ట్

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలం సిద్దనగట్టు, ఎల్.బండ, తండా, బోయినపల్లి, అమకతాడు గ్రామాల్లో శుక్రవారం 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. 6,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. వడ్ల గిడ్డయ్య, లక్ష్మీదేవి, మద్దమ్మపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే మరో కేసులో నలుగురిని అదుపులోకి తీసుకుని 375 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ అధికారులు



గడివేములలో నిర్మానుష్యంగా మారిన నందికొట్కూరు–నంద్యాల రోడ్డు



పుచ్చకాయ తింటున్న ప్రజలు

సుర్రుమంటున్న సూరీడు

నాలుగైదు రోజుల నుంచి సూర్యుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గడివేముల మండలంలో శుక్రవారం 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో అదే పరిస్థితి. ప్రజలు బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. మండలంలో అధికంగా మిరప, పత్తి సాగు చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో రైతులు ఉదయమే పనులు ముగించుకుని మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు వేడిని తట్టుకునేందుకు శీతలపానియాలతో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలను తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

–గడివేముల



చున్నీ కప్పకుని వెళ్తున్న జెడ్పీహైస్కూల్ విద్యార్థినులు

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం

ఓర్వకల్లు: హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. ప్యాపిలి జట్టు తొలి స్థానంలో నిలిచి రూ.15 వేలను అందుకుంది. రెండో స్థానంలో శకునాల జట్టు రూ.10 వేలు, మూడో స్థానంలో ఓర్వకల్లు జట్టు రూ.5 వేలు, నాల్గో స్థానంలో కాల్వబుగ్గ జట్టు రూ.3 వేల చొప్పున బహుమతులు అందుకున్నాయి. అలాగే ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో ఎస్ఎండీ ఫరూక్ మొదటి బహుమతిని దక్కించుకోగా, సంజిత్‌కుమార్ రెండో బహుమతిని సాధించారు.

వాలీబాల్ విజేత టీజీ క్లబ్ జట్టు : వాలీబాల్ పోటీల్లో కర్నూలు టీజీ క్లబ్ జట్టు తొలి స్థానం దక్కించుకున్నట్లు నిర్వాహకుడు ఇంతియాజ్‌బాషా తెలిపారు. పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొనగా టీజీ క్లబ్ జట్టు తొలి స్థానంలో నిలిచి రూ.5 వేల బహుమతి అందుకుంది. రెండో స్థానంలో ఓర్వకల్లు వలి జట్టుకు రూ.3 వేలు, మూడో స్థానం పుల్లారెడ్డి కళాశాల జట్టుకు రూ.2 వేలు, నాల్గో స్థానంలో ఓర్వకల్లు జట్టుకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

కేసీ కాల్వకు 81 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శుక్రవారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన ట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో కేవలం0.089 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు.